క్లుప్తంగా

పుత్తడిగైరంపేటలో పారుశుధ్య పనులు



పారుశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: పుత్తడిగైరంపేట పంచాయతీలో పారుశుధ్య పనులు శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ప్రతి వీధిలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను పారుశుధ్య సిబ్బంది తొలగించారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీసి మురుగు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. పారుశుధ్య లోపం వల్ల దోమల వ్యాప్తి అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ పనులు నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పత్తి రమణ, కార్యదర్శి కృష్ణ తెలిపారు. చెత్తను కాలువల్లో వేయకుండా కుండీల్లో వేయాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించడం తప్పనిసరి



హెల్మెట్ లేని వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ధారణ చేసి ప్రయాణాలను చేయాలని ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. శుక్రవారం కె.సంతపాలెం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు లేకుండా ప్రయాణాలు చేయడంతోపాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి అపరాధరుసుం విధించారు. కారు డ్రైవింగ్ చేసే వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు మలుపుల ప్రాంతాల వద్ద నెమ్మదిగా ప్రయాణించాలని, అతివేగంతో వెళ్లే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులతో కుటుంబాలకు దుఃఖాన్ని మిగల్చవద్దని వివరించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గణేష్



ఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అనకాపల్లిలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా ఎస్పీగా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయనకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్త పాము ధర్మారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి, చల్లా నాయుడు, కె.ఎస్ అప్పల నాయుడు, మాజీ సర్పంచ్‌లు చల్లా తాతయ్యలు, ఎం. ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

టౌన్ ఎస్సైగా సుధాకర్

నర్సీపట్నం: టౌన్ ఎస్సైగా సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ స్టేషన్‌లో సీఐతోపాటు నలుగురు ఎస్సైలు విధులు నిర్వహిస్తున్నారు. టౌన్ స్టేషన్ అవసరాల దృష్ట్యా అనకాపల్లి క్రైమ్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సుధాకర్‌ను ఎస్సైగా నియమించడంతో శుక్రవారం ఆయన విధుల్లో చేరారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అచ్చియ్యమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సచివాలయ భవనాన్ని స్థల దాత దంపతులతో ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. కె.జె.పురం గ్రామ సచివాలయం –2 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి ఆరా తీశారు. పింఛన్లు పొందని వారి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.3 కోట్లతో 1,550 ఇళ్లకు కుళాయిల ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ప్రమాదానికి గురైన కార్పెంటర్ చుక్కా నానాజీకి, పక్షవాతంతో బాధపడుతున్న భూపతి లక్ష్మికి, దివ్యాంగురాలు ఉరూకూటి లక్ష్మికి, అనారోగ్యానికి గురైన శీరందాసు అచ్చియ్యమ్మకు, పింఛనుకు నోచుకోని ఆడారి అప్పలనర్సమ్మకు రూ.2 వేల చొప్పున సొంత నగదు పంపిణీ చేశారు.

రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు

హౌసింగ్ కాలనీలో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు మంజూరు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. రూ.40 లక్షలతో నిర్మించిన కె.జె.పురం– 2వ గ్రామ సచివాలయం నూతన భవనాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్థల దాతతో కలిసి ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి రూ.15 లక్షల విలువైన ఏడున్నర సెంట్లు స్థలాన్ని మద్దాల వెంకట సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు మూడేళ్ల క్రితం దానంగా ఇచ్చారు. వీరిని శాలువా కప్పి సన్మానించారు. నాడు – నేడు నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో మీనాకుమారి, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ జామి రమణబాబు, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పార్టీ సీనియర్ నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, మాడుగుల ఎంపీటీసీ పోలిమేర విజయలక్ష్మి పాల్గొన్నారు.

దండిసురవరం పీఏసీఎస్ భవనం ప్రారంభం

చీడికాడ: దండిసురవరం పీఏసీఎస్ భవనాన్ని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి నందారపు రమణబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్ కొన అర్జున, నాయకులు కురచా నారాయణమూర్తి, పాతాళం చిన్నంనాయుడు, శ్రీను, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

7 గ్రామాల్లో జగనన్న గృహ శాశ్వత హక్కు సర్వే

- డీపీవో శిరీషారాణి



రోలుగుంటలో చెత్తతో సంపద తయారీ శాలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

రోలుగుంట: జగనన్న శాశ్వత భూహక్కు పథకం మాదిరిగానే ప్రభుత్వం జగనన్న గృహ శాశ్వత హక్కు పథకం కింద ఇళ్లను సర్వే చేయాలని నిర్ణయించిందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. ఇందుకోసం మండలంలో అర్ల, కొండపాలెం, పనలపాడు, వై.బి.పట్నం, రోలుగుంట, కొవ్వూరు, వెదుళ్లవలస గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లో గృహ నిర్మిత కొలతలను సర్వేయర్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి బృందంగా విధులు నిర్వహిస్తారని వివరించారు. మండలంలో రోలుగుంట, కొవ్వూరు గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ శాలలను ఈవోపీఆర్డీ మల్లికార్జునరావుతో కలసి ఆమె శుక్రవారం పరిశీలించారు. కొవ్వూరు సంపద శాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న రోలుగుంట చెత్తతో సంపద తయారీ శాలను త్వరితగతిన పూర్తి చేయించాలని పంచాయతీ కార్యదర్శి రవికిరణ్‌ను ఆదేశించారు. నిధులు మంజూరుకు ప్రతిపాదన అందించాలన్నారు.

నర్సీపట్నంలో గనులశాఖ కార్యాలయం



నూతనంగా ఏర్పాటైన గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

నర్సీపట్నం: జిల్లాల పునర్విభజనలో భాగంగా నర్సీపట్నంలో కొత్తగా డివిజనల్ గనులు, భూగర్భ శాఖ కార్యాలయం ఏర్పాటైంది. గతంలో అనకాపల్లి కేంద్రంగా గనుల శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేది. నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం, రావికమతం, వి.మాడుగుల, రోలుగుంట, చీడికాడ మండలాలతో డివిజన్ కార్యాలయం ఏర్పాటైంది. ఆయా మండలాల్లోని రాయి క్వారీలు, గ్రానైట్, లేటరైట్ క్వారీలు పర్యవేక్షించనున్నారు. డివిజనల్ మైన్స్ జియాలజిస్ట్‌గా బి.రవికాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ క్వారీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

శరవేగంగా ఐయితంపూడి రోడ్డు పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పార్టీ నాయకులు



ఐయితంపూడి రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టులు

బుచ్చెయ్యపేట: ఐయితంపూడి గ్రామానికి రోడ్డు ఏర్పాటుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చెయ్యపేటకు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి నేటికీ పక్కా రోడ్డు ఏర్పాటు లేదు. రోడ్డు వేస్తామని నమ్మించిన టీడీపీ నాయకులు 14 ఏళ్ల పాలనలో పట్టించుకోలేదు. దాంతో గోతులు పడిన మట్టి రోడ్డుపై గ్రామస్తులు రాకపోకలకు నానా ఇక్కట్లు గురయ్యేవారు. రోడ్డు వేయాలని పలుమార్లు ధర్నాలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి సమస్య వెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. బుచ్చెయ్యపేట, కేపీ అగ్రహారం నుంచి ఐయితంపూడి గ్రామంలోకి రోడ్డు ఏర్పాటుకు కోటి రూపాయిలు మంజూరు చేయించారు. గ్రావెల్, మెటల్ వేసి రోలింగ్ చేయడంతోపాటు మూడు కల్వర్టుల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం ఈ పనులను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు పరిశీలించారు. సర్పంచ్ పెద్దాడ నాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ ముచ్చకర్ల వెంకటరావు, సీనియర్ నాయకులు ముచ్చకర్ల మహాలక్ష్మినాయుడు, అయితరెడ్డి చినబాబు, సచివాలయ కన్వీనర్ అయితరెడ్డి రమణ, పాల సెక్రటరీ అయితరెడ్డి శ్రీను, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ పిల్లా బాలకృష్ణ, పాల కేంద్రం అధ్యక్షుడు అప్పాన ఎర్ర తాతబాబు, వార్డు మెంబర్ అయితరెడ్డి సత్తిబాబు, టీడీపీ నాయకులు పడాల గోవింద, ఐయితరెడ్డి వెంకటస్వామి ఈ సందర్భంగా ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ పవర్ లోడు నియంత్రణ చర్యలు

రోలుగుంట: పవర్‌లోడుతో ఫ్యూజ్ బ్రేకయి, పవర్ కట్ సమస్య ఏర్పడుతున్న స్థానిక వీధుల్లో ఆ శాఖ ఏఈ పద్మనాభం నియంత్రణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కొట్టేవీధి, ఎస్సీ కాలనీ దనిమిరెడ్డి తదితర వీధుల్లో లైన్‌మన్, హెల్పర్ జి.నూకరాజు, కె.రాంబాబు విద్యుత్ స్తంభాలకు ఉన్నటువంటి కనెక్షన్లను మార్చి లోడును నియంత్రించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పవర్ లోడుతో ఫ్యూజ్‌లు బ్రేకయి పవర్ కట్ సమస్య ఉంటే, తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తూటిపాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో శుక్రవారం ఉదయం దాడి చేశామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'వైఎస్సార్ పశు బీమా'తో భరోసా

- పశువైద్య శిబిరంలో ఏడీ చిట్టినాయుడు



పేడ పరీక్షలు నిర్వహిస్తున్న ఏడీ చిట్టినాయుడు తదితరులు

మాడుగుల: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకం భరోసా కల్పిస్తుందని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక గంటిమూడి వారి కళ్లాల వద్ద నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువుల వద్దకే వచ్చి వైద్యం అందించడానికి వైఎస్సార్ సంచార పశు వైద్య సేవా వాహనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను పాడిరైతులకు వివరించారు. 10 గర్భకోశ వ్యాధులకు, 8 చూడి పశువులకు 35 పేడ, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 1962 అంబులెన్స్ వెటర్నరీ అసిస్టెంట్ కిశోర్, లైవ్ స్టాక్‌,అసిస్టెంట్ సౌజన్య, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చివరి దశకు ఆక్రమణల తొలగింపు



కొత్తకోటలో మార్కింగ్ ఇస్తున్న దృశ్యం

రావికమతం: మూడు రోజులుగా చేపడుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. 90 శాతం పనులు పూర్తి కావచ్చాయి. స్థానిక బస్సు స్టేషన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకూ ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. గతంలో ఇరుకిరుకుగా ఉన్న రహదారి ప్రస్తుతం విశాలంగా కనిపిస్తోంది.

కొత్తకోటలో మార్కింగ్ ...

కొత్తకోట మేజరు పంచాయతీలో ఆక్రమణల తొలగింపులో భాగంగా శుక్రవారం మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. తహసీల్దార్ మహేశ్వరరావు, సర్వేయర్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఆర్అండ్‌బీ స్థలం ఉన్నంత వరకూ రోవర్ సిస్టం ద్వారా గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. వీరికి వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించారు.

వలంటీర్లే సంక్షేమ రథసారథులు

- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



ఎం. అలమండలో వలంటీర్లను సత్కరిస్తున్న గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్

మాకవరపాలెం: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ వలంటీర్లు సంక్షేమ రథసారథులుగా నిలుస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం కొండల అగ్రహారం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, గొంతిన హరిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం: గ్రామ వలంటీర్లు సైనికుల్లా సేవలందించాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తెలిపారు. 12 గ్రామ సచివాలయాల వలంటీర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, ఎంపీడీవో జయమాధవి, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ శానపతి వెంకటరత్నం, ఎంపీటీసీలు తాతమ్మ, సర్పంచ్ శెట్టి శ్రీనువాసరావు, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, నిద్దర శ్రీనువాసరావు, కార్యాలయ ఏవో రమణబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఎం. అలమండలో ఉత్తమ వలంటీర్లను ఎంపీటీసీ పోతల వెంకటరావు, వీఆర్వో పోతల శంకరరావులతో కలిసి గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, సర్పంచ్ దాడి జగన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్, బ్యాడ్జి, మెడల్ ప్రదానం చేశారు. మారేపల్లిలో సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు వలంటీర్లను సత్కరించారు. ఉప సర్పంచ్ రొంగలి కన్నంనాయుడు, మాజీ సర్పంచ్ అవుగడ్డ కోటిపల్లినాయుడు, ఏపీఎం ఎస్. ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన సీఎం జగన్

- భోగాపురంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ



భోగాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రైతులకు పూర్తిస్థాయిలో సాయమందించి, వ్యవసాయాన్ని పండగ చేసిందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం భోగాపురంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలో పొలాల్లోకి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో రైతులకు, వ్యవసాయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏవిధంగా సాయం అందించిందో వివరించారు. రైతు పండించిన పంటకు ఎటువంటి నష్టం వాటిల్లినా సకాలంలో బీమా అందిస్తున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాల వద్ద గతంలో రోజుల తరబడి పడిగాపులు కాసేవారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలను తీర్చాలని, ప్రతీ గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు పెట్టి వీటిని అందుబాటులోకి తెచ్చారన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పాడిరైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించడమే కాకుండా పాలకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చిన వైఎస్సార్‌సీపీకి అందరూ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, ఎంపీటీసీ ఆడారి కోటిభూలోక, మాజీ ఎంపీటీసీ దొడ్డి రమణారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు(డీవీఆర్), జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వల్లంపేట గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



వల్లంపేటలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: తనకు అవకాశం ఉన్నంత వరకు వల్లంపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మరెన్ని సంక్షేమ పథకాలు అందిస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హామీ ఇచ్చారు. శుక్రవారం వల్లంపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ ప్రయోజనాలపై మహిళలు, వివిధ కులవృత్తిదారులు, రైతులు ప్రతి వీధుల్లో ఆనందంతో చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. వారు చెప్పిన ప్రతి సమస్యను స్వయంగా నోట్ పుస్తకంలో నమోదు చేసుకుంటూ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో ప్రధాన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కారం చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు చూపించిన ఆప్యాయతకు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ పి.కనకారావు, సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల, ఎంపీటీసీ పల్లి భీమయ్యమ్మ, మాజీ సర్పంచ్ సుర్ల యోగీశ్వరుడు, నాయకులు ఇట్టంశెట్టి శ్రీను, మిడతాన సుధీర్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు సబ్బవరపు వెంకునాయుడు, సిద్దాబత్తుల వెంకటరమణ, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, ఉలబాల శ్రీను, కరక అప్పలరాజు, జి.సోమన్నదొర, ఎంపీటీసీలు పోలుపర్తి వెంకటరమణ ఇనసప్పల పుష్ప, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు

శనివారం సరుగుడు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణేష్ నిర్వహించనున్నారని పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

- అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో శచీదేవి



హెచ్.బి పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో శచీదేవి

కె.కోటపాడు: గర్భిణులు అధిక పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రీస్కూల్ చిన్నారులకు అందిస్తున్న ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులకు హిమోగ్లోబిన్ 12 శాతం కంటే అధికంగా ఉండాలని తెలిపారు. హెచ్‌బీ పరీక్షలో రక్తశాతం తక్కువగా ఉంటే ఐరన్ మాత్రలు లేని టానిక్‌లను అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రక్తహీనత సమస్య లేనట్లయితే తల్లీబిడ్డ ఆరోగ్యం క్షేమంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.

డోలీ మోతల కష్టాలకు చెక్

- చలిసింగం రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీలు శ్రీనివాసరావు, రాజు

రావికమతం: రోలుగుంట, రావికమతం మండల పరిషత్ నిధులతో రోలుగుంట మండలం అర్ల గ్రామం నుంచి రావికమతం మండలం చలిసింగం వరకు బైక్ వెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించేందుకు ఎంపీపీలు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పైల రాజు శుక్రవారం భూమిపూజ చేశారు. రావికమతం మండలం చలిసింగం వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. డోలి మోతలే శరణ్యమవుతున్నాయి. చీకాయపాడు నుంచి ఘాట్ నిర్మించాల్సి వస్తుండటంతో అటవీ అనుమతులు రాక ఇన్నాళ్లు పనులు కావడం లేదు. చలిసింగం గ్రామస్తులకు కనీసం బైక్ వెళ్లే సదుపాయమైనా కల్పించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరారు. ఈ మేరకు ఆయా మండల పరిషత్‌ల నుంచి రూ.5 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టాలని సూచించారు. చలిసింగం సర్పంచ్ ఒంజరి గంగరాజు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయానికి మైక్‌సెట్ వితరణ



మాజీ ఎంపీపీ భాస్కరరావుకు మైక్‌సెట్ అందజేస్తున్న దాతలు

దేవరాపల్లి: స్థానిక మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి గ్రామానికి చెందిన గండేపల్లి సోదరులు రూ.15 విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ మేరకు అమ్మవారి ఆలయంలో శుక్రవారం స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ భాస్కరరావులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, గ్రామ పెద్దలు వరదపురెడ్డి లలితానాయుడు, ఎల్లేటి కరుణాకర్‌రావు, గుండు రాంబాబు, గండిపడాల అప్పలరాజు, వెత్సా రమేష్, దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, బంధం అప్పలరాజు, వరదపురెడ్డి చంద్రరావు, సోమిరెడ్డి పేరునాయుడు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి

నాతవరం: కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో ఐసీడీఎస్, సచివాలయ, వైద్య, రెవెన్యూ శాఖల అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి, తదితరులు పాల్గొన్నారు.